# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 15 | బుధవారం | 12-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:15 | Wednesday | 12-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 'రేవంత్ సోదరులకు కోట్ల రూపాయలు ఎలా వస్తున్నాయి?

- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారనీ కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు



2లో



### ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా..

- మిగతా 2వ పేజీలో

### డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

## భారీ పెట్టుబడులే లక్ష్యం

### సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం
- వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష
- రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## రాష్ట్రవ్యాప్త బంద్‌లో ఏబీవీపీ ఆందోళనలు

రాంచీ: జార్ఖండ్‌లోని రాంచీలో ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల అవకతవకలపై జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లోని లోపాలను సవరించాలని, సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేపట్టిన విధానసభ ముట్టడి తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జీ, బాష్పవాయువు, వాటర్ కేనాన్లను ప్రయోగించారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

2లో



## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

- బాధితులను స్వదేశానికి రప్పించాలని అధికారులకు ఆదేశం
- బ్యాంకాక్ ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు
- సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచన



2లో



## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..

- జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి
- జాతీయ సగటును మించి ఏపీ వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

- మిగతా 2వ పేజీలో

## ఫొటోలో రాహుల్ గాంధీతో ఉన్న మహిళ ఎవరు?..

- కేంద్ర మంత్రి ట్వీట్‌పై దుమారం
- రాహుల్ గాంధీ ఫొటోపై గిరిరాజ్ సింగ్ ప్రశ్నలు
- ఫొటో ఎక్కడ? ఎప్పుడు? తీశారని ప్రశ్న
- రాహుల్‌తో ఉన్నది ఎవరని కేంద్ర మంత్రి ఆరా
- ఫొటోలో ఉన్నది స్నేహితుడి కుటుంబమని కాంగ్రెస్ వివరణ
- టెక్సాస్‌లో ఫొటో తీసినట్లు అవి దండియా వెల్లడి
- గిరిరాజ్‌పై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా తీవ్ర విమర్శలు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ మహిళ, చిన్నారితో పడవలో ఉన్న ఫొటోపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఈ చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేసి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఫొటో ఎక్కడ? ఎప్పుడు? తీశారో చెప్పాలని కోరారు. రాహుల్‌తో ఉన్నది ఎవరని ప్రశ్నించారు.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ స్పందించింది. ఫొటోలో ఉన్న మహిళ, చిన్నారి రాహుల్ స్నేహితుడి భార్య, కుమారుడేనని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా తెలిపారు. వారంతా కుటుంబ విహారయాత్రలో ఉన్నప్పుడు



## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

- వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు
- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు.

- మిగతా 2వ పేజీలో

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# భారీ పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు.ంహైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

# నకిలీ పోలీసులతో ర్యాలీలా?

(మొదటి పేజీ తరువాయి)

అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..
## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# ఫొటోలో రాహుల్ గాంధీతో ఉన్న మహిళ ఎవరు?..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఫొటో తీశారని చెప్పారు. రాహుల్ స్నేహితుడు మాత్రం చిత్రంలో లేరని వివరించారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అవి దండియా మరో వివరాన్ని వెల్లడించారు. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న లేక్ రే రాబర్ట్స్ వద్ద ఈ ఫొటో తీసినట్లు తెలిపారు. గిరిరాజ్ సింగ్ స్వయంగా వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. గిరిరాజ్ సింగ్ తీరుపై సుప్రియా తీవ్రంగా స్పందించారు. మహిళ, పురుషుడు కలిసి కనిపిస్తేనే చెడు ఆలోచనలు వస్తున్నాయంటూ విమర్శించారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై బీజేపీ విమర్శలు కొనసాగిస్తోంది. జూన్ 22 నుంచి జులై 13 వరకు ఆయన చేపట్టిన విదేశీ పర్యటనపై బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ గతంలో ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన ఎక్కడికి వెళ్లారు? ఎవరిని కలిశారు? పర్యటన ఖర్చులను ఎవరు భరించారని ప్రశ్నించారు. రాహుల్ విదేశీ పర్యటనల ఖర్చులు, భద్రతా నిబంధనలపైనా బీజేపీ గతంలో ఆరోపణలు చేసింది. విదేశీ పర్యటనలకు భారీగా ఖర్చు చేశారని ఆరోపించింది. అయితే తాజా ఫొటోపై మాత్రం కాంగ్రెస్ వివరణ ఇచ్చి.. అందులో ఉన్న మహిళ, చిన్నారి ఎవరన్న విషయాన్ని స్పష్టం చేసింది.

# మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

ఉద్యోగాల పేరుతో మోసపోయి మయన్మార్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. బ్యాంకాక్‌లో ఉద్యోగాలంటూ నమ్మించి కొందరిని మయన్మార్‌కు తరలించిన నేపథ్యంలో బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీ భవన్ అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన పలువురు నిరుద్యోగ యువకులు మయన్మార్‌లో చిక్కుకుపోయారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ యువతకు కీలక సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు పన్నే ఉచ్చులో పడొద్దని, ఉద్యోగాల విషయంలో పూర్తిస్థాయిలో ఆరా తీయకుండా ఎవరినీ నమ్మవద్దని హితవు పలికారు. ఇలాంటి మోసాలపై యువత చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్.?

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ కుంభకోణానికి పాల్పడిందని బిజెపి ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆయన కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, ప్రజలను వంచించడమని మండిపడ్డ ఆయన, ఉచిత విద్యుత్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని ధ్వజమెత్తారు. 'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' పథకం కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకునే 40 వేల ఇళ్లను గుర్తించి, వారి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు అమర్చేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్ రావు వివరించారు. ఈ టెండర్లలో ఒక ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ అమర్చేందుకు ఒక కంపెనీకి రూ.1,36,000లకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని, అయితే ఆ కంపెనీ సబ్ కాంట్రాక్ట్‌ను కేవలం రూ.86,000లకే మరొకరికి ఇచ్చిందని బయటపెట్టారు. దీనివల్ల ఒక్కో ఇంటిపై ఏకంగా రూ.50 వేలు మిగులుతోందని, ఈ రకంగా మొత్తం 40 వేల ఇళ్లకు కలిపి రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున భారీగా సబ్సిడీ ఇస్తుంటే, మోదీ



ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ స్కామ్‌పై నిజాయితీగా స్పందించి విచారణకు ఆదేశించాలని, లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై ప్రతిపక్షాలపై మండిపాటు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపై ఎంపీ రఘునందన్ రావు స్పందిస్తూ, సభను నడపడంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలకు కూడా సమాన బాధ్యత ఉంటుందని గుర్తుచేశారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చ ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాల వద్ద సరైన సబ్జెక్ట్ లేకే రోజువారీ రచ్చ చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సభలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాల గొడవ వల్ల ఇతర ఎంపీలు సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# రాష్ట్రవ్యాప్త బంద్‌లో ఏబీవీపీ ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పోలీసు చర్యను ఖండిస్తూ, ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ బంద్‌లోనూ నిరసనకారులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. బంద్ ప్రభావం రాజధాని రాంచీలో ఎక్కువగా కనిపిస్తోంది. ఆందోళనకారులు రోడ్లపై బైఠాయించి, టైర్లు కాల్చి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఫలితంగా రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. బంద్‌ను దృష్టిలో ఉంచుకుని పలు జిల్లాల్లో ప్రైవేట్ పాఠశాలలను కూడా మూసివేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పరిస్థితిని అదుపు చేయడానికి రాంచీలో దాదాపు రెండు వేల మంది పోలీసులను మోహరించారు. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను రంగంలోకి దించారు. డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొడర్మా, దుమ్కా, గఢ్వా తదితర ప్రాంతాల్లోనూ బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి దుకాణాలను బంద్ చేయించారు. రాంచీలోని కిశోర్‌గంజ్ చౌక్, హర్మూ చౌక్, భారత్ మాతా చౌక్ వద్ద ఆందోళనకారులు టైర్లు కాల్చి నిరసన తెలిపారు. శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక నిఘా ఉంచింది.

# 'రేవంత్ సోదరులకు కోట్ల రూపాయలు ఎలా వస్తున్నాయి?



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

**దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి: సీఎం చంద్రబాబు పిలుపు**

ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌ఎఫ్' జిల్లా జనరల్ సెక్రటరీగా శ్రవణ్ కుమార్

- బలహీన వర్గాలు, జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యం
- బాధిత న్యాయవాదులకు అండగా ఉంటాం: సుక్క శ్రవణ్ కుమార్



**తొలివెలుగు, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా ఎంఎల్‌ఎఫ్ జనరల్ సెక్రటరీగా రామన్నపేటకు చెందిన ఏజీపీ, న్యాయవాది సుక్క శ్రవణ్ కుమార్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రవణ్ కుమార్ ఎన్నిక పట్ల రామన్నపేట ఎంఎల్‌ఎఫ్ సభ్యులు, సీనియర్, సహచర న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుక్క శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదుల హక్కుల పరిరక్షణతో పాటు జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అడ్వకేట్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేస్తూ, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎంఎల్‌ఎఫ్ లక్ష్యాలకు అనుగుణంగా శ్రమిస్తానని స్పష్టం చేశారు. నిరంతరం బాధిత న్యాయవాదుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 'చేయూత' పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో ఆవుల రాములు




**తొలివెలుగు, రామన్నపేట :** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేయనున్న 'చేయూత' సామాజిక భద్రత పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని రామన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆవుల రాములు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులతో పాటు తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామపంచాయతీలు లేదా వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో దరఖాస్తు చేయని వారు, అవసరమైన పత్రాలు అందించని వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వనస్థలిపురంలో ఘనంగా 'తిరంగయాత్ర'

- జాతీయ సమైక్యతను కాపాడాలి: బీజేపీ నాయకులు
- బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో ముమ్మరంగా ర్యాలీ



**తొలివెలుగు, వనస్థలిపురం :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో మంగళవారం తిరంగయాత్రను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, కాటం క్రాంతిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో యాత్ర సాగించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రభారి, ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రివర్ణ పతాకం భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్యానికి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో నాయకులు కొప్పుల నరసింహారెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నూటి శ్రీనివాస్, తడకమళ్ల విజయకుమార్, చిట్టిపోల్ రవికుమార్, శ్రీధర్‌రావు, రవిశంకర్, ప్రేమనాథ్, భూపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డి, శరత్‌కుమార్, సురేష్, మహేష్, రాష్ట్ర యువ మోర్చా నాయకులు భార్గవ్‌తేజ, సాయిరాంగౌడ్, చరణ్, చైతన్యగౌడ్, అభినందన్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు అండగా.. బీర్ల ఫౌండేషన్

- ఘనంగా బీర్ల అనిత జన్మదిన వేడుకలు
- కార్మికులకు ఉచితంగా బట్టల పంపిణీ

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆటో కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు బట్టలు అందజేసి, వారి సేవలను అభినందించారు. కార్మికులు, పేద ప్రజలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బీర్ల అనిత జన్మదిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



- ట్రస్ట్ బోర్డు సమావేశంలో డిమాండ్లను ప్రస్తావిస్తాం: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- ఎమ్మెల్యేను కలిసిన వైడీఓయూ ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. యాదాద్రి దేవాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ (వైడీఓయూ) ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, పాలకవర్గం చొరవ చూపాలని కోరారు. టెండర్ షెడ్యూల్‌లోని 'యూనియన్ పెట్టరాదు' అనే నిబంధనను తొలగించి, ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు వారానికి ఒక రోజు సెలవు (వీక్లీ ఆఫ్) ఇవ్వడంతో పాటు నిబంధనల ప్రకారం రోజుకు 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ గార్డులకు కనీసం రూ.15 వేల వేతనం అందించాలని, ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ఆటోనమస్ బోర్డు ఏర్పడిన నేపథ్యంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు దేవస్థానం నుంచే నేరుగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ ప్రతినిధులు కోరారు.

**13న ట్రస్ట్ బోర్డు సమావేశంలో ప్రస్తావిస్తాం:**

ఉద్యోగుల డిమాండ్లపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందించారు. ఈ నెల 13న జరగనున్న ఆలయ ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో సమస్యల పరిష్కారంలో పురోగతి సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తమ సమస్యలను ట్రస్ట్ బోర్డు దృష్టికి తీసుకెళ్లేందుకు హామీ ఇవ్వడం పట్ల వైడీఓయూ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



# నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

- కవితకు వినతిపత్రం అందజేసిన వెల్ఫేర్ అసోసియేషన్
- ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి: నోముల సూర్యనారాయణ

**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** తెలంగాణ రాష్ట్రంలో నర్సింగ్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నోముల సూర్యనారాయణ కోరారు. నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలపై మంగళవారం ఎల్‌బీనగర్‌లో కవితను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో నర్సింగ్ ఆఫీసర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, వేతనాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ ఆఫీసర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్య న్యాయ సలహాదారు భారతి మాట్లాడుతూ.. నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, చట్టపరంగా, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లిపాక వెంకటేష్, కోశాధికారి అనిల్ కుమార్, ప్రచార కార్యదర్శి శ్వేత, గౌరవ అధ్యక్షుడు రాము, నాయకులు మధు, శ్రేయ, లత, బిందు, రమ్య, యాదగిరి, దేవేందర్, నరేష్, శ్రీలత, ప్రసాద్, అంబేద్కర్, ఎస్.కె. గౌస్ తదితరులు పాల్గొన్నారు.






# మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు.. మృత్యువు ఒడిలోకి చేరొద్దు

- రాయగిరి - మోత్కూర్ రోడ్డుపై పోలీసుల స్పెషల్ డ్రైవ్
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు: ఎస్ఐ లక్ష్మీనారాయణ

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** మద్యం సేవించి వాహనం నడపడం అంటే మృత్యుపాశాన్ని మెడకు వేసుకోవడమేనని ఆత్మకూర్(ఎం) ఎస్ఐ ఎన్. లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రాయగిరి – మోత్కూర్ ప్రధాన రహదారిపై మంగళవారం పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుడి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్‌కు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, పోలీసుల తనిఖీల సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు అప్పగించే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ తేల్చి చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఏఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు మల్లేష్, లక్ష్మణ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి'





- రాజాపేట హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన డీఈఓ భిక్షపతి
- ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాల బోధన

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి సూచించారు. మంగళవారం ఆయన రాజాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన డీఈఓ భిక్షపతి ఆంగ్లం, గణితం ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఏ మేరకు అర్థం చేసుకున్నారో తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయుల టీచింగ్ డైరీలు, పీరియడ్ ప్రణాళికలు, విద్యార్థుల జవాబు పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ద్వారా విద్యార్థుల హాజరును, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను తనిఖీ చేశారు.

**ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచాలి:**

పాఠశాల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన డీఈఓ భిక్షపతి.. హెచ్ఎం తడక రాజుతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం పెంచాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి, వారిలోని ప్రతిభను వెలికితీసేలా బోధన సాగించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు తడక రాజు, కిరణ్మయి, ఉపాధ్యాయులు ఇప్ప సంజీవులు, దుడుక జానయ్య, జక్కుల ప్రభాకర్, కె. అరుణకుమారి, పీజే పత్రిసియా, ఎండీ ఆశా, ఏ. అనిత, ఎం. రాజేశ్వరి, డి. మాధవి, ఆర్. శ్యాంసుందర్, మాధవిలత, అనురాధ, జానకి, సరిత, అండాలు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఇమ్మడి శిరీష పాల్గొన్నారు.

## గ్రీన్‌సిటీ కాలనీలో మహిళ అదృశ్యం

- ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాధితురాలు
- హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్‌లోని గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బొర్రాత్ సాయిబాబా పెద్ద కుమార్తె లక్ష్మి (38)కి బాలకృష్ణతో వివాహం కాగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి తండ్రి ఇంట్లోనే నివాసముంటోంది. ఈ క్రమంలో ఈ నెల 9న మధ్యాహ్నం 12 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి సాయిబాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## మూసీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

- చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**తొలివెలుగు, చైతన్యపురి :** చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసీ నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్, సత్యనగర్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ వెనుక భాగంలో ఉన్న మూసీ నదిలో సోమవారం మధ్యాహ్నం సుమారు 12.40 గంటలకు ఓ పురుషుడి మృతదేహం తేలుతూ కనిపించింది. గమనించిన స్థానికులు డయల్-100కు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పెట్రోలింగ్ సిబ్బంది స్థానికుల సహకారంతో మృతదేహాన్ని నది నుంచి బయటకు తీశారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, గుండ్రటి ముఖం ఉండి బూడిద రంగు చుక్కల షర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చైతన్యపురి పోలీసులు తెలిపారు. సదరు వివరాలతో పోలిన వ్యక్తి ఎవరైనా అదృశ్యమైనా లేదా ఆచూకీ తెలిసినా చైతన్యపురి పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.ద

## 'చాకలి ఐలమ్మ' పాటల సీడీ విడుదల

- ఆవిష్కరించిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు శ్వేత
- ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనియాడిన నాయకులు




**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కీర్తిస్తూ రూపొందించిన పాటల సీడీని మంగళవారం ఉప్పల్‌లోని కేబీఆర్ స్టూడియోలో ఆవిష్కరించారు. భూదాన్ పోచంపల్లికి చెందిన ప్రముఖ కవి, గాయకుడు చీరాల ప్రకాష్ స్వయంగా రచించి గానం చేసిన ఈ సీడీని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేతా ఐలమ్మ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఐలమ్మ వీరగాథలను, పోరాట పటిమను నేటి తరానికి పాటల రూపంలో అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేబీఎన్ స్టూడియో అధినేత బిక్షం నాయక్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిమినేటి నగేష్, రజక సంఘం జిల్లా నాయకులు ఎలిమినేటి ఎలేందర్, వేలిమినేటి మహేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.ద

## ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం భద్రం


- పల్లెర్ల రైతువేదికలో ఆత్మ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ
- సాగు ఖర్చులు తగ్గించుకోవాలి: ఆత్మ డీపీడీ దేవ్ సింగ్

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** నేలలో సహజ జీవసారాన్ని, సూక్ష్మజీవుల కార్యకలాపాలను పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతగానో దోహదపడతాయని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవ్ సింగ్ తెలిపారు. మండల పరిధిలోని పల్లెర్ల రైతువేదికలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రకృతి వ్యవసాయం' అనే అంశంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ్ సింగ్ మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సాగు ఖర్చులను నియంత్రించుకోవాలన్నారు. సేంద్రియ పదార్థాల వినియోగం, పచ్చిరొట్ట ఎరువుల సాగు, పంటల మార్పిడి పద్ధతులను రైతులు విధిగా పాటించాలని సూచించారు. ఆలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ ఎస్. సుధాకర్ మాట్లాడుతూ.. సుభాష్ పాలేకర్ విధానంలో బీజామృతం, జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి వినియోగించి రసాయన రహిత ఆహారాన్ని పండించవచ్చన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కె. నిర్మల మాట్లాడుతూ.. ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటలు, మిశ్రమ పంటలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. శ్రీనివాస్, సర్పంచ్ తండ మంజుల నరసింహ, పిఎసిఎస్ డైరెక్టర్ కోడిత్యాల పద్మ, ఏఈఓ ఎం. అశోక్ కుమార్, మాజీ జెడ్పీటీసీ నరేందర్ గుప్తా, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.




# నమిలలో పంచాయతీ కార్యదర్శి అక్రమాలు

- తప్పుడు పత్రాలు, డబుల్ రిజిస్ట్రేషన్లతో కలకలం
- వెలుగుచూసిన 5 వేలకు పైగా నకిలీ డాక్యుమెంట్లు
- అక్రమాలకు పాల్పడి.. ఉద్యోగానికి రాజీనామా చేసిన కార్యదర్శి
- మోసపోయిన వేలాది మంది.. పట్టించుకోని అధికారులు




**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నమిల గ్రామపంచాయతీలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి నవీన్‌పై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేయడంతో పాటు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాల కారణంగా గ్రామంలో పలు వివాదాలు తలెత్తడంతో పాటు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమాల ఆరోపణలు:**

గ్రామస్థుల ఆరోపణల ప్రకారం.. నవీన్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఇళ్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, స్థలాలకు సంబంధించిన పత్రాలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలోనూ నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ పలువురు ఫిర్యాదులు, పిటిషన్లు సమర్పించినట్లు స్థానికులు చెబుతున్నారు.

**భూముల లావాదేవీలపైనా వివాదాలు:**

నమిల గ్రామ రెవెన్యూ పరిధిలోని 74, 83, 107, 108, 109, 110, 111 సర్వే నంబర్లకు సంబంధించిన భూముల విషయంలోనూ వివాదాలు ఉన్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆయా భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించడంతో పాటు, కొన్ని స్థలాలను రెండుసార్లు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయని చెబుతున్నారు.
ఈ వ్యవహారాలపై గ్రామపంచాయతీ కార్యాలయంలో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ బాధితులు పిటిషన్లు ఇచ్చినట్లు సమాచారం. మొత్తం వ్యవహారానికి సంబంధించి 5 వేలకు పైగా డాక్యుమెంట్లు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటుండటంతో అసలు పత్రాలు ఏవి? వాటి ఆధారంగా జరిగిన లావాదేవీలు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**వేలాది కుటుంబాల్లో ఆందోళన:**

పత్రాల వ్యవహారం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాల కోసం డబ్బులు చెల్లించినప్పటికీ రికార్డుల్లో స్పష్టత లేకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

**ఫిర్యాదులపై చర్యలు ఎప్పుడు?**

గతంలోనే ఈ వ్యవహారాన్ని అధికారుల, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ రికార్డులు, జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు, భూముల లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

**రాజీనామాతో సమస్య పరిష్కారమా?**

తనపై వస్తున్న ఆరోపణలు, గ్రామంలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే రాజీనామా చేయడం వల్ల గతంలో జారీ చేసిన పత్రాలు, పంచాయతీ రికార్డులు, భూముల లావాదేవీలపై తలెత్తిన ఆరోపణలకు పరిష్కారం లభించదని బాధితులు అంటున్నారు. నమిల గ్రామంలో నెలకొన్న వివాదాలపై పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గు తేల్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# తపాస్‌పల్లి నీటితో రాజాపేట చెరువులను నింపాలి: రైతు జేఏసీ





- ఎండిపోతున్న బోర్లు.. వర్షాభావంతో నిండని చెరువులు
- మూడేళ్లయినా నెరవేరని ప్రభుత్వ విప్ హామీ

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని గొలుసుకట్టు చెరువులను తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో నింపి ఆయకట్టును ఆదుకోవాలని రాజాపేట రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న తమకు ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు మరింత శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో నిరసన తెలిపారు.

**ఆశలు ఆవిరి చేసిన ఎల్‌నినో:**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో మండల వ్యాప్తంగా తగినంత వర్షపాతం నమోదు కాలేదు. దీంతో మండలంలోని 10 ప్రధాన చెరువులు, 36 కుంటల్లోకి చుక్క నీరు వచ్చి చేరలేదు. రాజాపేట, సింగారం, జాల, కురారం, పాముకుంట, మల్లగూడెం, నమిల, దూదివెంకటాపురం, బొందుగుల, చల్లూరు, సోమారం చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి. చెరువులు నిండితే వరి సాగు చేద్దామనుకున్న రైతులకు, బోర్లు కూడా ఎండిపోతుండటంతో తీవ్ర నిరాశే మిగిలింది.

**ప్రత్యామ్నాయ పంటలకూ అడ్డంకులు:**

నీటి లభ్యతను బట్టి పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటలు వేయాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ.. కోతులు, అడవిపందుల బెడద కారణంగా రైతులు ఆసక్తి చూపడం లేదు. అరకొర నీటితోనే వరి సాగుకు పూనుకుని ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు నీళ్లు రాక భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని వాపోయారు.

**రెడ్డి చెరువు నిండితేనే మహర్దశ:**

తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి 8 కిలోమీటర్ల కాలువ ద్వారా సింగారం పైన ఉన్న రెడ్డి చెరువు, జాల, కురారం గొలుసుకట్టు చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరిగి ప్రాంతానికి మహర్దశ వస్తుందని వివరించారు. మూడేళ్ల క్రితం రైతు జేఏసీ నిరసన తెలిపిన సమయంలో 'సర్వే చేయించి నీరందిస్తాం' అని ప్రభుత్వ విప్ ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు సర్వే నిర్వహించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం: సర్పంచ్ కోయ మధు

- రాజాపేట గ్రామపంచాయతీ వద్ద గ్రామసభ
- పారిశుద్ధ్యం, తాగునీరు, ఉపాధి పనులపై చర్చ

**తొలివెలుగు, రాజాపేట:** వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజాపేట సర్పంచ్ కోయ మధు సూచించారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని, మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీధిదీపాల మరమ్మతులు, ఉపాధి హామీ (ఈజీఎస్) పనుల నిర్వహణపై సభలో విస్తృతంగా చర్చించారు. ప్రజల కనీస అవసరాలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారెడ్డి రాజా మహేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ నెమల కేదారి గౌడ్, వివిధ వార్డుల సభ్యులు, గ్రామ పెద్దలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





## గ్రామాలు నాలుగు.. రెవెన్యూ ఒకటే!

- పాముకుంట పరిధిలోనే మూడు కొత్త గ్రామాలు
- రెవెన్యూ విభజన లేక ఇబ్బందుల్లో స్థానికులు, రైతులు

**తొలివెలుగు, రాజాపేట :** ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినప్పటికీ.. రెవెన్యూ వ్యవస్థలో మార్పులు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పాముకుంట రెవెన్యూ పరిధిలో ఏళ్ల క్రితం పుట్టగూడెం, కొండ్రెడ్డి చెరువు, మల్లగూడెం గ్రామాలను ఏర్పాటు చేశారు. పంచాయతీలుగా ఇవి వేర్వేరుగా ఉన్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో మాత్రం 1 నుంచి 724 సర్వే నంబర్ల వరకు ఇప్పటికీ 'పాముకుంట' పేరుతోనే కొనసాగుతున్నాయి.

**రాబడి కోల్పోతున్న కొత్త పంచాయతీలు:**

రెవెన్యూ గ్రామాలుగా గుర్తింపు లేకపోవడంతో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని నూతన పంచాయతీలు కోల్పోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, వారసత్వ మార్పులు, సరిహద్దుల వివాదాలు, సర్వే తదితర పనుల కోసం ఇప్పటికీ పాత రెవెన్యూ గ్రామం పేరుతోనే లావాదేవీలు నిర్వహించాల్సి వస్తోంది.

**ధరణి/భూ భారతి సేవల్లో ఆటంకాలు:**

ఆన్‌లైన్ రెవెన్యూ సేవల్లో (ధరణి/భూ భారతి) తమ గ్రామం పేరు కనిపించకపోవడంతో రైతులు, మహిళలు, వృద్ధులు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పడిన గ్రామాలకు తగినట్లుగా రెవెన్యూ పరిధులను పునర్వ్యవస్థీకరించి, ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని జిల్లా ఉన్నతాధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఆహ్వానం

- సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారానికి పిలుపు
- కలిసిన చౌటుప్పల్ పురపాలక నేతలు, నూతన ధర్మకర్తలు



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణం భవానీనగర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు పస్తం గంగరాములు, దేవాలయ నూతన చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, కొత్తగా ఎన్నికైన ధర్మకర్తలు వరకాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ నాయక్, బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు శ్రేయస్కరం: సర్పంచ్ జువ్వి నర్సింహ్మా

- ధర్మోజిగూడెంలో 'జలసిరి' పనుల ప్రారంభం
- వాన నీటిని వృథా పోనివ్వకూడదని పిలుపు



**తొలివెలుగు,చౌటుప్పల్ :** భూగర్భ జల మట్టాలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామంలో మంగళవారం ఇంకుడు గుంత నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షపు నీరు వృథాగా పోకుండా భూగర్భంలోకి ఇంకిపోయేలా చేసేందుకు ఇంకుడు గుంతలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. భావితరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి మళ్లించడమే ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. గ్రామంలో వీలైనన్ని ఎక్కువ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు సామిడి సంధ్య, ఐతరాజు శారద, రాచకొండ భార్గవ్, జీడిముద్ల శోభ, గునుగంటి వెంకటేశం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేశ సమగ్రత, ఐక్యతను చాటాలి

- పోచంపల్లిలో ఘనంగా తిరంగా ర్యాలీ
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వట్మూరి అశోక్ గౌడ్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ తమ దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వట్మూరి అశోక్ గౌడ్ పిలుపునిచ్చారు. 80 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, పార్టీ శ్రేణులు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ పురవీధుల గుండా నేతాజీ చౌరస్తా వరకు ముందుకు సాగారు. అనంతరం నేతాజీ చౌరస్తా వద్ద సామూహికంగా వందేమాతరం ఆలపించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలంతోనే నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, వందేమాతరం గేయాన్ని ఆలపించడమే ధ్యేయంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ నాయక్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, చేనేత సెల్ అధ్యక్షుడు గంజి బసవలింగం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెరుకు వెంకటేష్, శ్రీరామ మంజుల లింగస్వామి, రామిడి యాదిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.





# 'సైబర్ ఉచ్చులో పడొద్దు.. అపరిచిత లింకులు నమ్మొద్దు!'





- సవారియా కంపెనీలో చౌటుప్పల్ పోలీసుల అవగాహన కార్యక్రమం
- ఓటీపీలు, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు: సీఐ మన్మథ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మన్మథ కుమార్ సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు చౌటుప్పల్ స్టేషన్ పరిధిలోని లింగోజిగూడెంలో గల సవారియా కంపెనీలో మంగళవారం సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ ఉద్యోగులు, స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ పెట్టుబడులు, ఉద్యోగాలు, బహుమతులు, తక్కువ వడ్డీకే రుణాలు అంటూ వచ్చే మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని హెచ్చరించారు. యుపిఐ లావాదేవీలు జరిపేముందు సంబంధిత వ్యక్తుల వివరాలను సరిచూసుకోవాలన్నారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే '1930' హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని, సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి: జడ్పీ సీఈవో శోభారాణి

- పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు
- గ్రామంలో పూర్తయిన, పెండింగ్ ఇళ్ల పరిశీలన

**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్ధ వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (జడ్పీ సీఈవో) శోభారాణి ఆదేశించారు. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు.

**పాఠశాల సందర్శన - విద్యార్థులకు దుస్తుల పంపిణీ:**

సందర్శనలో భాగంగా ముందుగా పంతంగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జడ్పీ సీఈవో సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత పాఠశాల దుస్తులను (యూనిఫారాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో



చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన:**

అనంతరం గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ఆమె స్వయంగా పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల వివరాలను హౌసింగ్ ఏఈ పవన్



కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగడంపై ఆరా తీస్తూ, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీలత, పంతంగి గ్రామ సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి పద్మజ, హౌసింగ్ ఏఈ పవన్ కళ్యాణ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విజయ్ ప్రియమైన త్రిషకు డిప్యూటీ సీఎం పదవి ఎప్పుడు.?"

**అన్నాడీఎంకే నేత సంచలన వ్యాఖ్యలు..**

సినీ నటి త్రిష మరోసారి తమిళనాడు రాజకీయాల్లో టార్గెట్ అయ్యారు. అన్నాడీఎంకే సీనియర్ నేత ఆర్బీ ఉదయ్ కుమార్ సీఎం విజయ్‌ను విమర్శించేందుకు త్రిషను టార్గెట్ చేశారు. విజయ్‌కు 'ప్రియమైన' త్రిషను తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఎప్పుడు నియమిస్తారని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆగస్టు 8న తూత్తుకుడిలో జరిగిన జయలలితా పేరవై సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కావేరీ నది నీటిని కర్ణాటక నుంచి విడుదల చేయించడంలో తమిళనాడు ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శలు చేశారు. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులకు టీవీకే అధిక ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించే క్రమంలో ఉదయ్ కుమార్ త్రిషపై వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నిర్మాత అర్చన కల్పాతిని తమిళనాడు హిందూ మత, ధర్మాదాయ శాఖ ప్రత్యేక ఏడుగురు సభ్యుల రాష్ట్రస్థాయి కమిటీలో నియమించింది. ఇదిలా ఉంటే, ఉదయ్ కుమార్ వ్యాఖ్యలపై త్రిష అభిమాన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆయనకు వ్యతిరేకంగా మధురైలో పోస్టర్లు అంటించారు. త్రిషను రాజకీయాల్లోకి లాగడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల డీఎంకే నేత, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ త్రిషను ఉద్దేశిస్తూ డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం తమిళనాడులో రాజకీయ ఆందోళనల్ని పెంచింది. దీనికి ముందు బీజేపీ రాష్ట్ర చీఫ్ నైనార్ నాగేంద్రన్ కూడా త్రిషపై వ్యాఖ్యలు చేసి, ఆ తర్వాత క్షమాపణలు చెప్పారు.

# ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.. ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయంటే..

భారతదేశంలో రూ.10, రూ.20 విలువ కలిగిన కరెన్సీ నోట్ల మన్నికను పెంచేందుకు ప్లాస్టిక్ (పాలిమర్) నోట్లను క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం ప్రయోగాత్మకంగా తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చట్టం 1934లోని సెక్షన్ 25 ప్రకారం పంపిన ఈ ప్రతిపాదన ఆధారంగా.. మొత్తం 200 కోట్ల పాలిమర్ నోట్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ధృవీకరించారు. కాగితపు నోట్లతో పాటు సమాంతరంగా ఈ పాలిమర్ నోట్లు చలామణిలో ఉంటాయని ఆమె వివరించారు.ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రారంభ దశలో ఉన్నందున, అధికారిక విడుదల తేదీ లేదా ఖర్చు వివరాలను ఇంకా నిర్ణయించలేదు. తదుపరి ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి వీటిని చలామణిలోకి తెచ్చేలా ఆర్‌బీఐ ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో గత 30 ఏళ్లుగా పాలిమర్ నోట్లు విజయవంతంగా వాడుకలో ఉన్నాయి. కాగితపు నోట్లతో పోలిస్తే ఇవి 2 నుండి 4 రెట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉండటమే కాకుండా, తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోకుండా అరికడతాయి. ఇదే సందర్భంలో దేశ ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన ఆర్థిక మంత్రి, దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోనే ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరాల్లో తగ్గుముఖం పట్టిన రిటైల్ ద్రవ్యోల్బణం, పశ్చిమాసియా సంక్షోభం, వాతావరణ మార్పుల కారణంగా 2026–27 మొదటి త్రైమాసికంలో 3.9 శాతానికి చేరినప్పటికీ, ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం పరిమితి లోపే ఉందని స్పష్టం చేశారు. అలాగే.. జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణ ద్వారా పన్ను భారాన్ని తగ్గించామని, వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల ప్రజల వ్యయ సామర్థ్యం పెరిగిందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రైవేట్ వినియోగ వ్యయం పుంజుకోవడంతో పాటు, తక్కువ మరియు మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తికి రక్షణ లభిస్తోందని మంత్రి వెల్లడించారు.

# డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే. నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: రోజా



కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

# ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు.. రెడ్ అలర్ట్ జారీ..



ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు రాబోయే మూడు గంటల్లో అత్యంత తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అలాగే గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే వీలుందని అధికారులు వెల్లడించారు. ఈ వర్షాల దాటికి వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని స్పష్టం చేసింది. వర్షంతో పాటు పిడుగులు పడే ముప్పు ఎక్కువగా ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు లేదా హోర్డింగ్ల వద్ద నిలబడవద్దని హెచ్చరించారు. రైతులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని విజ్ఞప్తి చేశారు. విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు పాత శ్రీకాకుళం, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. ముందస్తు జాగ్రత్త చర్యగా స్థానిక జిల్లా యంత్రాంగాలు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయి. కలెక్టరేట్లలో అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లను సైతం ఏర్పాటు చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే గమనిస్తూ, ప్రమాదకరమైన వర్షపు నీటిలో రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని యంత్రాంగం గట్టిగా ఆదేశించింది.

# మద్యం పాలసీపై ప్రభుత్వం కసరత్తు.. సెప్టెంబర్ 30 చివరి తేదీ..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన మద్యం పాలసీ రూపకల్పనపై ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనుండటంతో, తదుపరి తీసుకోబోయే నిర్ణయాలపై అధికారుల మధ్య చర్చలు సాగుతున్నాయి. 2024 అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన రెండేళ్ల పాలసీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో.. పూర్తిగా కొత్త పాలసీని తీసుకురావాలా లేదా ప్రస్తుతం ఉన్న లైసెన్సులనే రెన్యువల్ చేయాలా అనే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోంది. గతంలో దరఖాస్తు ఫీజుల రూపంలో ప్రభుత్వానికి దాదాపు రూ.1,900 కోట్ల మేర భారీ ఆదాయం రాగా, వ్యాపారుల నుంచి 90 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే.. ప్రస్తుతం ఉన్న మార్జిన్లు తమకు ఏమాత్రం ప్రయోజనకరంగా లేవని లైసెన్సుదారులు చెబుతున్నారు. కొనుగోళ్లపై కనీసం 20 శాతం మార్జిన్ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



మరోవైపు.. ప్రస్తుత లైసెన్సులనే రెన్యువల్ చేసే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం, భారీ మొత్తంలో లైసెన్స్ ఫీజు నిర్ణయించే ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా నగరాల్లో రూ.40 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 లక్షల వరకు లైసెన్స్ ధరలను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ ఫీజును వ్యాపారులకు వెసులుబాటుగా 50 శాతం చొప్పున రెండు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించనున్నారు. త్వరలోనే మద్యం వ్యాపారులతో నేరుగా చర్చలు జరిపి వారి అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు, ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా ఎంత ఆదాయం సమకూరుతుందనే అంచనాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన బార్ల సుదీర్ఘకాల లైసెన్సులను తిరిగి పునరుద్ధరించే అంశంపైనా కసరత్తు కొనసాగుతోంది. వీటన్నింటిపై అధ్యయనం ముగిసిన తర్వాత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని క్యాబినెట్ సబ్ కమిటీ నూతన మద్యం పాలసీపై తుది నిర్ణయం తీసుకోనుంది.

# గెలుపు తర్వాత నియోజకవర్గ యువతకు ప్రశాంత్ కిశోర్ తొలి హామీ

బాంకీపూర్ ఉప ఎన్నికలో విజయం సాధించిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ యువతకు కీలక హామీ ఇచ్చారు. వచ్చే రెండేళ్లలో నియోజకవర్గానికి చెందిన కనీసం 10 వేల మంది యువతకు ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఇందుకోసం విద్యార్హతలు ఉన్న యువత బయోడేటాలు, సీవీలను తన కార్యాలయంలో అందజేయాలని కోరారు. బాంకీపూర్‌లో మంగళవారం నిర్వహించిన పలు కృతజ్ఞత సభల్లో ప్రశాంత్ కిశోర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తాను హామీ ఇవ్వడం లేదని చెప్పారు. అయితే తన పరిచయాలు, నెట్‌వర్క్‌ను ఉపయోగించి దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించేలా చూస్తానని తెలిపారు. బిహార్‌లో జనసురాజ్ వ్యవస్థ బలపడిన తర్వాత ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని ప్రశాంత్ కిశోర్ అన్నారు. నియోజకవర్గంలో పిల్లల విద్యకు పునాది వేసే చర్యలు చేపడతానని చెప్పారు. నిలిచిపోయిన వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రేషన్ కార్డు కోసం లంచం అడిగే పరిస్థితి లేకుండా చేస్తానని చెప్పారు. ఇందుకు మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. రేషన్ కార్డు ఉన్నవారికి ప్రస్తుతం అందుతున్న నాలుగు కిలోల ధాన్యాన్ని ఐదు కిలోలకు పెంచుతామని తెలిపారు. వృద్ధుల పింఛన్ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితాలతో బిహార్ రాజకీయాల్లో మార్పు కనిపిస్తోందని ప్రశాంత్ కిశోర్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్ల' గురించి కాకుండా విద్య, ఉపాధి గురించి చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఇది ప్రజల ఓటుకున్న శక్తి అని పేర్కొన్నారు.

# ఇదో పెద్ద జోక్.. నా ఓటునే తీసేశారు: ప్రకాశ్ రాజ్

విలక్షణ నటుడు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై తనదైన శైలిలో విమర్శలు చేసే ప్రకాశ్ రాజ్, తన పేరును బెంగళూరు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటకలో ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియలో భాగంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ అంశంపై ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై ప్రకాశ్ రాజ్ ఒక వీడియో విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ.. "మిత్రులారా.. మీకో జోక్ చెప్పాలి. బెంగళూరు నియోజకవర్గంలో ఓటు హక్కు కోల్పోయిన 65 లక్షల మందిలో నేను కూడా ఒకడిని. మంచి జోక్ కదా? నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే చదువుకున్నాను, నాటకరంగంలో రాణించాను. మీ అందరికీ తెలిసినట్లుగా, ఇదే నియోజకవర్గం నుంచి ఎంపీగా కూడా పోటీ చేశాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. "ఇది మంచి జోకే. ఆట మొదలైంది. నా ఓటర్ ఐడీని తిరిగి పొందడానికి ఎలాంటి ప్రక్రియను అనుసరించాలో చూస్తాను. అయితే, మీకు ఓటు వేయని కొందరు పౌరుల ఓటు హక్కును మీ అధికారంతో మీరు అడ్డుకోవచ్చు. కానీ, మిమ్మల్ని అధికారం నుంచి దించే మా శక్తిని మీరు ఆపగలరా? జస్ట్ ఆస్కింగ్" అంటూ పాలకులకు సూటిగా సవాల్ విసిరారు.

**విద్యార్థులపై దాడిని ఖండించిన ప్రకాశ్ రాజ్**


ఇదే సమయంలో ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరసన తెలుపుతున్న జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ అభ్యర్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్‌ను కూడా ప్రకాశ్ రాజ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ, లాఠీలతో దాడి చేస్తున్న వీడియోను షేర్ చేస్తూ.. "ఎందుకు? ఎందుకు? ఎందుకు? ఈ క్రూరత్వాన్ని ఇక సహించలేం. ఇది అహంకారపూరిత అధికారాన్ని పడగొట్టడానికే దారితీస్తుంది" అని హ్యాష్‌ట్యాగ్‌తో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. ప్రకాశ్ రాజ్ ఇటీవల 'డకాయిట్: ఏ లవ్ స్టోరీ', 'జన నాయగన్' వంటి చిత్రాల్లో కనిపించారు. వచ్చే ఏడాది ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రానున్న 'వారణాసి', సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో కనిపించనున్నారు.






# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ

ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



# ముందు కాలుస్తాం.. తర్వాత మాట్లాడతాం

విజయ్ సేతుపతి హీరోగా వస్తోన్న లేటేస్ట్ మూవీ 'స్లమ్ డాగ్-33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాకు టాలీవుడ్ డైరక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ బాలీవుడ్ భామ టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. టబు రోల్ పరిచయం చేస్తూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ చూస్తుంటే టబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ గౌరీ హెగ్డేగా కనిపించనుంది. ఈ చిత్రంలో టబు రోల్ హైలెట్‌గా ఉండనుందని గ్లింప్స్ చూస్తుంటే అర్థమవుతోంది. 'మా ఓల్డ్ సిటీలో ముందు కాలుస్తాం.. తర్వాత మాట్లాడతాం' అనే డైలాగ్ మరింత ఆసక్తి పెంచుతోంది. కాగా.. ఈ మూవీలో సంయుక్త, దునియా విజయ్, జరీనా వహాబ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తున్నారు.



# కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క

## ట్రైలర్ విడుదల చేసిన చిత్రబృందం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.




# మెగా ఆఫర్ కొట్టేసిందట?

గత ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఈ ఏడాది సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'.. ఇలా వరుస సంక్రాంతి విజయాలతో పండుగ హీరోయిన్‌గా పేరు గాంచింది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ఓ అపూర్వమైన అవకాశం మీనాక్షి చౌదరి తలుపు తట్టినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో మీనాక్షి చౌదరి నటించనున్నదట. అయితే.. ఆమెది హీరోయిన్ పాత్ర కాదని, ఓ అతిథి పాత్రలో ఆమె కనిపిస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ఆమె పాత్ర ఉంటుందట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని, మాఫియా నేపథ్యంలో ఆయన పాత్ర సాగుతుందని వినికిడి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'లో 'డీసీ' బ్యూటీ?

టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తుండగా, యంగ్ హీరో తేజ సజ్జ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ గ్యాప్ తర్వాత ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పౌరాణిక సూపర్‌హీరో చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇదిలాఉంటే, ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ క్రేజీ బజ్ వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రెండింగ్ బ్యూటీ వామికా గబ్బి 'జై హనుమాన్' చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కోలీవుడ్ హిట్ చిత్రం 'డిసి' లో తన అద్భుతమైన నటనతో మంచి మార్కులు కొట్టేసిన వామికా.. ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుందనే వార్త అభిమానులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. విభిన్న నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న వామికా గబ్బి ఈ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com